విశాలాంధ్ర కృష్ణా జిల్లా

6 కేజీల గంజాయి స్వాధీనం - నలుగురి అరెస్టు

థమ్సప్ బాటిల్‌లో గంజాయి సేవిస్తున్న బెంగాల్ యువకులు

విశాలాంధ్ర-విజయవాడ క్రైం: థమ్సప్ బాటిల్‌తో గంజాయి సేవిస్తున్న బెంగాల్‌కు చెందిన ముగ్గురు యువకులతో పాటు మరో మహిళను విజయవాడ భవానీపురం పోలీసులు అరెస్టు చేశారు. భవానీపురం పోలీస్ స్టేషన్ ప్రాంగణంలో శనివారం విలేకరుల సమావేశంలో పశ్చిమ ఏసీపీ డాక్టర్ హనుమంతరావు వివరాలను వెల్లడించారు. గుంటూరు జిల్లా తాడేపల్లికి చెందిన వల్లూరి నాగమణి తన అల్లుడి వద్ద గంజాయి కొనుగోలు చేసి మగ్గం పనులకు బెంగాల్ నుంచి వచ్చిన యువకులకు గంజాయి అలవాటు చేసింది. ఈక్రమంలో గొల్లపూడి ఆర్టీసన్ స్కూల్ రోడ్డులోని ఖాళీ స్థలంలో బెంగాల్‌కు చెందిన షేక్.అమీనూర్(27), కరీబుల్లా లష్కర్(30) అబ్బాసుద్దీన్ (30)లు ఖాళీ థమ్సప్ బాటిల్‌కు రంధ్రం వేసి గంజాయి సేవిస్తున్నారు. సమాచారం అందుకున్న భవానీపురం పోలీసులు ముగ్గురిని అదుపులోకి వారు ఇచ్చిన సమాచారంతో నాగమణిని అదుపులోకి తీసుకుని 6 కేజీల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. వారి కేసు నమోదు చేశారు. ఈ సమావేశంలో భవానీపురం సీఐ యం.డీ.ఉమర్, ఎస్సైలు రవీంద్రబాబు, ప్రసాద్‌లు పాల్గొన్నారు.

ఉద్యోగుల బకాయిలు సత్వరమే చెల్లించాలి

ఉద్యోగ సంఘాల చర్చా వేదికలో డిమాండ్.

విశాలాంధ్ర-కూచిపూడి : రాష్ట్ర ప్రభుత్వం ఉద్యోగులకు పంపిణీ చేయాల్సిన బకాయిలను వెంటనే చెల్లించి చట్టబద్ధత కల్పించాలని డిమాండ్ చేశారు. మొవ్వలో ఏపీజీఈఏ మొవ్వ తాలూకా యూనిట్ అధ్యక్షులు కంచర్ల శివప్రసాద్ (వ్యవసాయ అధికారి) అధ్యక్షతన జరిగిన సమావేశానికి ముఖ్యఅతిథిగా జిల్లా యూనిట్ కార్యదర్శి టీవీ విఎస్ వరప్రసాద్ పాల్గొని ప్రసంగించిన అనంతరం పలు తీర్మానాలను చేశారు. ఉద్యోగస్తులు జీతాలను, ఇతర బెనిఫిట్స్ ను చెల్లించడానికి డిమాండ్ చేశారు. ప్రభుత్వం నుంచి రావలసిన డి ఏ బకాయిలు, సరెండర్ లీవ్, జిపిఎఫ్ లోన్, పదవీ విరమణ చేసిన ఉద్యోగాలకు రావాల్సిన సదుపాయాలు సకాలంలో చెల్లించాల్సిన కోరారు. ఉద్యోగస్తులకు న్యాయబద్ధంగా రావలసిన బెనిఫిట్స్ చెల్లింపుల్లో జాప్యం ఉండరాదని సూచిస్తూ ప్రతి నెల ఒకటో తారీకు నాటికి జీతం చెల్లించాలని కోరుతూ తీర్మానం చేశారు. అదేవిధంగా ప్రభుత్వ ఉద్యోగుల న్యాయపరమైన సమస్యలు పరిష్కరించాలని కూడా సూచించారు. ఈ సమావేశంలో కృష్ణాజిల్లా యూనిట్ ఉపాధ్యక్షులు జేఎల్ ప్రసాద్, బి సురేష్ బాబు నాయక్, సాయిరాం నాయక్‌లు, పామర్రు తాలూకా యూనిట్ అధ్యక్షులు కే ఏసుబాబు, ఏపీ పంచాయతీ రాజ్ మినిస్టీరియల్ స్టాఫ్ మొవ్వ తాలూకా యూనిట్ అధ్యక్షులు ఎం అలీ, అతిథులుగా పాల్గొన్న ఈ సమావేశంలో ప్రభుత్వ ఉద్యోగులు, సచివాలయాల సిబ్బంది హాజరయ్యారు.

ప్రతి నెల పౌర్ణమికి అరుణాచలంకు ప్రత్యేక బసులు

విశాలాంధ్ర-గుడివాడ : గుడివాడ పరిసర ప్రాంతాల ప్రయాణికులు, భక్తులకు ఏపీఎస్ఆర్టీసీ గుడివాడ డిపో నుండి ప్రతినెల పౌర్ణమి రోజు అరుణాచలం గిరి ప్రదక్షిణ చేసుకొనుటకు భక్తులకు సూపర్ లగ్జరీ బస్సులను ఏర్పాటు చేసినట్లు ఆర్‌టిసి డియం జి.రాజేష్‌కుమార్ తెలిపారు. శనివారం ఆయన విలేకర్లుతో మాట్లాడుతూ అరుణాచలంకు ఆర్‌టిసి బస్సును వచ్చే నెల 4వ తేది రాత్రి 08.00 గంటలకు గుడివాడ నుండి బయలుదేరి 5వ తేది ఉదయం శ్రీకాళహస్తి దర్శనం చేసుకొని, మధ్యాహ్నం కాణిపాకం విగ్నేశ్వరస్వామి దర్శనం చేసుకుని, సాయంత్రం సిరిపురంలో గోల్డెన్ టెంపుల్ చేరుకుని దర్శనం చేసుకునేలా ఏర్పాటు చేశామన్నారు. అదే రోజు రాత్రి బయలుదేరి 6వ తేది పౌర్ణమి రోజు ఉదయం అరుణాచలం చేరుకుని గిరి ప్రదక్షిణ దర్శనం చేసుకునేల ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు. 6వ తేది సాయంత్రం బసు బయలుదేరి 7వ తేది ఉదయం 7.00 గంటలకు గుడివాడకు చేరుకుంటుందన్నారు. సూపర్ లగ్జరీ బస్సు.2=2 సీటర్. పుష్ బ్యాక్. టికెట్ ధర రూ.3 వేలు, కావున గుడివాడ నియోజవర్గ పరిసర ప్రాంత ప్రజలు, ప్రయాణికులు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని డిపో మేనేజర్ జి. రాజేష్‌కుమార్ తెలిపారు.

'పది' విద్యార్థులకు అల్పాహారం

విశాలాంధ్ర-కూచిపూడి : ఏప్రిల్‌లో జరిగే పదవ తరగతి పరీక్షలకు సాయంత్రం వేళలో పిల్లలకు నిర్వహించే ప్రత్యేక తరగతుల కోసం కృష్ణా జిల్లా పరిషత్ యాజమాన్యం సోమవారం నుంచి అల్పాహారం పంపిణీ చేయడానికి రంగం సిద్ధం చేసింది. అయితే మొవ్వ మండలంలో 8 జిల్లా పరిషత్ పాఠశాలలు, ఒక ఎయిడెడ్ పాఠశాల కలిసి 9 పాఠశాలలు ఉండగా కేవలం ఏడు పాఠశాలలకు మాత్రమే అల్పాహారం మంజూరు చేయటంపై ఆ రెండు పాఠశాలల విద్యార్థులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. సంస్కృతం ప్రధానంసంగా గల కూచిపూడి శ్రీ సిద్ధేంద్ర జిల్లా పరిషత్ ఓరియంటల్ హై స్కూల్, పెదముత్తేవి లక్ష్మీపతిస్వామి విద్యా విహార్‌ఓరియంటల్ సంస్కృతహై స్కూల్ కావడం గమనార్హం. అల్పాహారంలో భాగంగా గోధుమ రవ్వ ఉప్మా 40 గ్రాములు, ఉడికించినశనగలు 40 గ్రాములు రోజు విడిచి రోజు పంపిణీ చేస్తారు. ఈ నేపద్యంలో శనివారం నాటికి ఆయా పాఠశాలలకు అల్పాహారం పదార్థాలు చేరాయి.

మలబార్‌లో నృత్యాంజలి కలెక్షన్స్

విశాలాంధ్ర-విజయవాడ (లబ్బీపేట) : దేశంలోనే అతిపెద్ద బంగారు మరియు వజ్రాభరణాల రిటైల్ వ్యాపార సంస్థల్లో ఒకటైన మలబార్ గోల్డ్ అండ్ డైమండ్స్, భారతదేశ నృత్యాలను సగౌరవంగా స్మరించుకుంటూ 'నృత్యాంజలి' అనే సరికొత్త ఆభరణాల సేకరణలను తమ మలబార్ గోల్డ్ అండ్ డైమండ్స్ విజయవాడ షోరూము లో విడుదల చేసినట్లు షోరూమ్ హెడ్ నిఖిల్‌చంద్రన్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ ఆభరణాల సేకరణలో సంక్లిష్టమైన హస్తకళ ప్రావీణ్యంతో చెక్కబడిన అంశాలు ప్రముఖంగా కనిపిస్తాయని, హస్తకళా నైపుణ్యం ఉట్టిపడే ప్రతి ఆభరణం 100 శాతం బి.ఐ.ఎస్ హాల్మార్క్ చేయబడిన స్వచ్ఛమైన బంగారంతో తయారు చేయబడి, ఉన్నతమైన సొగసు కోసం విలువైన రత్నాలు పొదగబడ్డాయన్నారు. మా కస్టమర్ల జీవితంలోని ప్రతి ప్రత్యేక క్షణంలో భాగం కావాలని, ప్రతి సందర్భానికి మా ప్రత్యేక సేకరణలు, అసాధారణమైన నాణ్యత, నమ్మకమైన కస్టమర్ సేవలతో అందించాలని ప్రయత్నిస్తున్నామని వివరించారు.

పిల్లలను ఇంటి వద్ద కూడా చదివించండి

విశాలాంధ్ర-కూచిపూడి : పదవ తరగతి పబ్లిక్ పరీక్షలకు పిల్లలను ఇంటి వద్ద కూడా చదివటానికి చర్యలు తీసుకోవాలని ప్రధానోపాధ్యాయురాలు అన్నే లక్ష్మీకుమారి సూచించారు. జిల్లా విద్యాశాఖ ఆదేశాలతో కూచిపూడిలోని సిద్ధేంద్ర జెడ్పీ హైస్కూల్‌లో శనివారం 10వ తరగతి పిల్లల తల్లిదండ్రులతో పాఠశాలలో సమావేశం నిర్వహించి పలు సూచనలు ఇచ్చారు. జగనన్న గోరుముద్ద ద్వారా తాము అందించే ఆహారంతో పాటు ఇంటి వద్ద కూడా పిల్లలకు ప్రోటీన్స్ కలిగిన బలవర్ధకమైన ఆహారం అందించి మరింత శక్తివంతులుగా తీర్చిదిద్దాలని ఆమె తల్లులకు సూచించారు. ఆమెతోపాటు ఉపాధ్యాయులు గుంటూరు వెంకట సత్యప్రసాద్,పామర్తి శ్రీనివాసరావు, ఆలూరి సురేష్, పేరెంట్స్ మానిటరింగ్ కమిటీ చైర్మన్ జుజ్జవరపు మంగమ్మ తదితర ఉపాధ్యాయులు పాల్గొన్నారు. అలాగే తల్లిదండ్రుల సమావేశాలు భట్లపెనుమర్రు, పెడసనగల్లు, చినముత్తేవి, నిడుమోలు, కాజ, కోసూరు, పెదముత్తేవి, మొవ్వ హై స్కూల్స్ లో కూడా నిర్వహించారు.

గ్రామాల్లో ఫీవర్ సర్వే...

విశాలాంధ్ర-కూచిపూడి : గ్రామాలలో రోజురోజుకీ వైరల్ ఫీవర్స్ పెరుగుతున్న దృష్ట్యా పీహెచ్సీ వైద్యాధికారి డాక్టర్ సూచనలతో వైద్య ఆరోగ్య సిబ్బంది సర్వేనిర్వహిస్తున్నారు. దీనిలో భాగంగానే కూచిపూడి సచివాలయ పరిధిలోని గ్రామాల్లో ఆరోగ్య కార్యకర్త కే .రామాంజనేయులు, సిహెచ్‌ఓ కళ్ళేపల్లి దివ్య శనివారం సర్వే నిర్వహించారు. అదేవిధంగా జలుబు, దగ్గు, జ్వరాలు గొంతు నొప్పి, తుమ్ములు, ముక్కుకారటం లాంటి సమస్యలపై కూడా నమోదు చేసుకుంటున్నారు. ఇటీవల హెచ్3ఎన్2 ఇన్ ఫ్లు ఎంజా వైరస్ పెరుగుతున్న దృష్ట్యా వైద్యసిబ్బంది పలు జాగ్రత్తలను హెచ్చరిస్తున్నారు. కరోనా,బి19 మహమ్మారి ప్రబోయిన సమయంలో తీసుకోవలసిన జాగ్రత్తలు మాదిరిగానే ప్రస్తుతం తీసుకోవాలని వైద్య ఆరోగ్యశాఖ అధికారులు సూచనలు ఇస్తున్నారు. ముఖ కవచనాలు(మాస్కులు) తగిలించుకోవాలని, చేతులు ఎప్పటికప్పుడు పరిశుభ్రతగా చేసుకోవాలని, భౌతిక దూరం పాటించాలని, గుంపులు గుంపులుగా ఉండరాదని జ్వరం ఒళ్ళు నొప్పులు ఉంటే అశ్రద్ధ చేయక వెంటనే ప్రభుత్వ వైద్యాధికారిని సంప్రదించి అవసరమైన మందులు తీసుకోవాలని హెచ్చరికలు జారీ చేస్తున్నారు.

పాఠశాలస్థాయిలోనే లక్ష్యాన్ని ఎంచుకోండి

రూ.15 లక్షల స్కాలర్‌షిప్‌ల పంపిణీలో కృష్ణాజిల్లా పరిషత్ చైర్‌పర్సన్ ఉప్పాల హారిక

విశాలాంధ్ర-విజయవాడ (ఎడ్యుకేషన్) : విద్యలోనే కాకుండా అన్ని రంగాలలోనూ బాలికలు మరింతగా రాణించాల్సిన అవసరం ఎంతైనా ఉందని కృష్ణాజిల్లా పరిషత్ చైర్‌పర్సన్ ఉప్పాల హారక అన్నారు. జీవితంలో ఉన్నతస్థాయికి ఎదిగేందుకు పాఠశాలస్థాయిలోనే లక్ష్యాలను ఎంపిక చేసుకుని వాటి సాధనకు కృషి చేయాలని సూచించారు. తమ ఉత్పత్తులను ఎంతో ఆదరిస్తున్న గ్రామీణ ప్రాంత రైతు కుటుంబాల చిన్నారులు ఉన్నత విద్యను అభ్యసించే ఉద్దేశంతో కోరమండల్ ఇంటర్నేషన్ లిమిటెడ్ ఏటా కోట్లాది రూపాయలను స్కాలర్‌షిప్‌లుగా అందజేయటం ముదావహమన్నారు. విజయవాడలోని మాకినేని బసవపున్నయ్య విజ్ఞాన కేంద్రం (ఎంబివికె) ఆవరణలో కార్పొరేట్ సామాజిక బాధ్యతలో (సిఎస్ఆర్) బాధ్యతగా గతేడాది తొమ్మిదో తరగతిలో అత్యుత్తమ ప్రతిభ కబనబరిచిన ఉమ్మడి కృష్ణాజిల్లాకు చెందిన 237 విద్యార్థినులకు రూ.15 లక్షల విలువైన నగదు పురస్కారాలను జడ్పీ చైర్‌పర్సన్ ఉప్పాల హారిక శనివారం అందజేశారు. తొలుత ఆమె జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. అనంతరం ఈ ఏడాది ఉత్తమ మహిళ రైతు అవార్డును తోట్లవల్లూరు మండలం పాముల్లంకకు చెందిన పాముల రాణికి అందజేసి, ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా హారిక మాట్లాడుతూ, గ్రామీణ ప్రాంతాలలో ఉన్న బాలికలలో అత్యుత్తమ ప్రతిభ ఉన్నప్పటికీ, కుటుంబాల ఆర్థిక పరిస్థితి వల్ల మధ్యలో చదువులకు స్వస్తి పలుకుతున్నారని తెలిపారు. ఈ నేపథ్యంలో ప్రభుత్వం ఏటా అమ్మ ఒడి కింద రూ.15 వేలు తల్లుల ఖాతాలో జమ చేస్తుందన్నారు. అయితే, కోరమండల్ సంస్థ 18 సంవత్సరాలుగా పలు జిల్లాల్లో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో చదువుతున్న బాలికలకు మొదటి బహుమతిగా రూ.5 వేలు, రెండో బహుమతిగా రూ.3,500 అందించడం అభినందనీయమన్నారు. కోరమండల్ సంస్థ రైతులు దినదినాభివృద్ధి చెందాలని గ్రోమోర్ ఎరువులను ప్రవేశపెట్టిందని, అదే రీతిలో బాలికలు కూడా విద్యారంగంలో మరింత రాణించి, భవిష్యత్‌లో ఉన్నత శిఖరాలను చేరుకోవాలన్నారు. అపుడే కోరమండల్ సంస్థ అందించిన నగదు పురస్కారలకు సార్థకత కలుగుతుందన్నారు. పదో తరగతి పరీక్షలకు సిద్ధమవుతున్న బాలికలకు శుభాకాంక్షలు తెలిపిన ఆమె, జీవితంలో తమ లక్ష్య సాధనకు కృషి చేయాలని సూచించారు. ఎన్‌టీఆర్ జిల్లా వ్యవసాయాధికారిణి ఎం విజయభారతి మాట్లాడుతూ, బాలురతో పోల్చితే బాలికలలో కష్టపడి పని చేసే తత్వం అధిమని, అందువల్ల బాలికలకు విద్య అత్యంత అవశ్యమన్నారు. జిల్లా నుంచి ఎంపిక చేసిన 237 మంది ప్రత్యేకత కలిగిన వారన్నారు. గతంతో పోల్చితే అగ్రికల్చర్ కోర్సులను బాలికలే అధికంగా చేస్తున్నారని, అందువల్ల వారికి అనేక రకాల ఉద్యోగవకాశాలు అందుబాటులో ఉన్నాయన్నారు. కోరమండల్ స్కాలర్‌షిప్‌లను పొందిన విద్యార్థులకు తమ ప్రాంతాలలో ఒక ప్రత్యేక గుర్తింపు లభిస్తుందన్నారు. కోరమండల్ ఇంటర్నేషనల్ లిమిటెడ్ ఉపాధ్యక్షుడు జివి సుబ్బారెడ్డి మాట్లాడుతూ, నేడు 60 శాతం నుంచి 70 శాతం మంది బాలికలు ప్రొఫెషనల్ కోర్సులను చేస్తున్నారన్నారు. సమాజంలో యువతే కీలక పాత్ర పోషించాల్సిన అవసరం ఉందన్నారు. ఈ నేపథ్యంలో విద్యార్థులు పాఠశాల స్థాయిలోనే తమకంటూ ఒక లక్ష్యాన్ని ఎంపిక చేసుకుని, దాని సాధనకు కష్టపడి కృషి చేయాలని ఆయన కోరారు. ఈ ఏడాది సుమారు రెండు వేల మంది విద్యార్థులకు నగదు పురస్కారాలను అందజేస్తున్నట్లు తెలిపారు. తమ సంస్థ 2005 నుంచి ఈ స్కాలర్‌షిప్‌లను ప్రధానం చేస్తుండగా, ఇప్పటి వరకు సుమారు 18 వేల మందికి అందజేశామన్నారు. కోరమండల్ ఇంటర్నేషనల్ లిమిటెడ్ హెచ్‌ఆర్ ఇన్‌చార్జి కొండిపర్తి సుధాకర్ (శ్రీనివాస్) అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో రీజనల్ బిజినెస్ హెడ్ కెఎస్ఆర్ చక్రవర్తి, డిజిఎం ఎం సచ్చిదానందరెడ్డి, డివిజనల్ అగ్రామినిస్ట్ మోహన్‌కుమార్, సీనియర్ అగ్రామినిస్ట్ పృథ్వీలాల్, హెచ్‌ఆర్ గాయత్రి, మేనేజర్ హరి, అకౌంట్స్ ఇన్‌చార్జి భవానీ తదితరులు పాల్గొన్నారు.

బంధన్ మ్యూచువల్ ఫండ్‌గా ఐడీఎఫ్‌సీ మ్యూచువల్ ఫండ్

విశాలాంధ్ర-విజయవాడ (వన్‌టౌన్): ఐడీఎఫ్‌సీ మ్యూచువల్ ఫండ్ ఇప్పుడు బంధన్ మ్యూచువల్ ఫండ్‌గా నూతన గుర్తింపును పొందింది. మార్చి 13 నుంచి ఈ గుర్తింపుతోనే అది కనిపించనుంది. తదనుగుణంగా ఈ ఫండ్ హౌస్ ప్రతి పథకానికీ ఐడీఎఫ్‌సీ పదానికి బదులుగా బంధన్ పదం కనిపించనుంది. అయితే పెట్టుబడుల వ్యూహాలు, ప్రక్రియలు, బృందం మాత్రం అదే కొనసాగుతుంది. మదుపరులు, అదే తరహా అత్యున్నత నాణ్యత కలిగి పెట్టుబడుల విధానంతో ప్రయోజనం పొందగలరని ఏఎంసీ సీఈఓ విశాల్ కపూర్ తెలిపారు.

ఐటీసీ లిమిటెడ్‌తో యాక్సిస్ బ్యాంక్ భాగస్వామ్యం

విశాలాంధ్ర-విజయవాడ (వన్‌టౌన్): భారతదేశంలోని మూడవ అతిపెద్ద ప్రైవేట్ రంగ బ్యాంకు అయిన యాక్సిస్ బ్యాంక్, ఐటీసీ వ్యవసాయ అనుసంధానిత వ్యవస్థలో భాగమైన రైతులకు బ్యాంక్ రుణ ఉత్పత్తులు సేవలను అందించడానికి ఐటీసీ లిమిటెడ్‌తో తన భాగస్వామ్యాన్ని ప్రకటించింది. ఈ భాగస్వామ్యం దేశంలోని మారుమూల ప్రాంతాలలో సేవలందని, తక్కువ సేవలందుతున్న రైతుల ఆర్థిక అవసరాలను తీర్చడానికి యాక్సిస్ బ్యాంక్‌కి ఉపకరిస్తుంది. రైతు రుణాలు, బంగారు రుణాలు మొదలైన అనేక రకాల ఉత్పత్తులను బ్యాంక్ అందజేస్తుంది. తన పూర్తి స్థాయి అగ్రిటెక్ అప్లికేషన్‌ను యాక్సిస్ బ్యాంక్ ఐటీసీ మార్స్ ద్వారా వారి ఆర్థిక అవసరాలను తీర్చడం, రైతులకు చేరువ కావడానికి ఊతమిస్తుంది. అదనంగా భారత దేశంలోని 656 జిల్లాల్లో ఉన్న తన గ్రామీణ, పట్టణ, సెమీ అర్బన్ శాఖల ద్వారా రైతులకు విస్తృతమైన ఉత్పత్తులు, సేవలను కూడా అందిస్తుంది.

షెల్స్ అమెజాన్ రెండవ ఎడిషన్ ప్రారంభం

విశాలాంధ్ర-విజయవాడ (వన్‌టౌన్): మహిళలకు ఎదుగుదల, పురోగతికి సమాన అవకాశాలను అందించేందుకు తన అంకితభావాన్ని అమెజాన్ ధృవీకరిస్తోంది. అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని మహిళల వినూత్న స్ఫూర్తి, నాయకత్వం మరియు శ్రేష్ఠతను అమెజాన్ ఇండియా వేడుకగా ఆచరిస్తోంది. ఈ ఏడాది 'ఎంబ్రేస్ ఈక్విటీ' అనే థీమ్‌తో, అమెజాన్ మహిళల భాగస్వామ్యాన్ని వృద్ధి చేసేందుకు, వర్క్‌ఫోర్స్‌లో వారి సేవల వృద్ధికి వెసులుబాటు కల్పించే దిశలో అమెజాన్ ఇండియా తన కార్యక్రమాలను హైలైట్ చేయడానికి వరుసగా రెండవ ఏడాది తన షెల్స్ అమెజాన్ క్యాంపెయిన్‌ను ప్రారంభించింది. ఆవిష్కరణలో ముందంజలో, కంపెనీలో రోల్‌మోడల్‌గా లేదా స్ఫూర్తిగా పనిచేస్తున్న మహిళలను ఈ క్యాంపెయిన్ వెలుగులోకి తీసుకు వస్తుంది.

విద్యార్థులకు పోత్సాహక బహుమతులు

విశాలాంధ్ర-పెదపారుపూడి : కోరమాండల్ ఇంటర్నేషనల్ లిమిటెడ్ కార్పొరేట్ సోషల్ రెస్పాన్సిబిలిటీ (సి.ఎస్.ఆర్.) సౌజన్యంతో బాలికల విద్యను ప్రోత్సహించటానికి మండలంలోని యలమర్రు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పదవ తరగతి చదువుతున్న విద్యార్థులలో ఏ.పూజిత ప్రథమస్థానం, రూ5,000, కే. మాధవి ద్వితీయ స్థానం రూ3,500 నగదు, ప్రశంసా పత్రాలను జెడ్పీ చైర్‌పర్సన్ ఉప్పల హారిక చేతుల మీదుగా విజయవాడ, గవర్నర్‌పేట, మాకినేని బసవపున్నయ్య విజ్ఞాన కేంద్రంలో జరిగిన బాలికల ప్రతిభ పురస్కార కార్యక్రమంలో అందుకున్నట్లు ఆ పాఠశాల ప్రధానోపాధ్యాయులు రావెళ్ల వరుణ్ కుమార్ శనివారం తెలిపారు. ఈ విషయమై ఆ పాఠశాల ఉపాధ్యాయులు పి. సత్యనారాయణ, వి. సాంబశివరావు, పి. అంబేద్కర్, ఎస్. కరుణకుమార్, పీఎం. సోమేశ్వరరావు, జి. మురళీకృష్ణ, విద్యార్థుల తల్లిదండ్రులు, తదితరులు అభినందించిన వారిలో ఉన్నారు.

తాడంకి విద్యార్థులకు పురస్కారం

విశాలాంధ్ర-పమిడిముక్కల: తాడంకి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థిలకు కోరమాండల్ ఫెర్టిలైజర్స్ సంస్థ వారు తొమ్మిదవ తరగతిలో అత్యధిక మార్కులు పొందిన వారికి నగదు పురస్కారాన్ని అందచేశారని ప్రధానోపాధ్యాయులు శారదా కాంత తెలిపారు. శనివారం కోరమాండల్ ఫెర్టిలైజర్స్ సంస్థ వారు విజయవాడలోని మాకినేని బసవపున్నయ్య విజ్ఞాన కేంద్రంలో నిర్వహించిన కార్యక్రమంలో సదరు పాఠశాల కు చెందిన కంభపు నాగదివిజ కి ప్రధమ బహుమతి గా రూ.5000 లు ద్వితీయ స్థానంలో కుంపటి సత్య ప్రసన్నకు రూ.3500లు నగదు, ప్రసంసా పత్రము జిల్లా పరిషత్ చైర్మన్ ఉప్పాల హారిక సదరు విద్యార్థులకు అందజేశారు.ఈ కార్యక్రమంలో కోరమాండల్ ఫెర్టిలైజర్స్ సిబ్బంది జడ్పిటిసి యేసుగు వెంకట రమణ కుమారి కంభపు రాంబాబు పి.డి.ఎ.పి.రాజు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థి మృతికి కారణమైన పాఠశాల గుర్తింపును రద్దు చేయాలి

బాధిత కుటుంబానికి న్యాయం చేయాలి

ఘటనా స్థలాన్ని పరిశీలించిన ఏఐఎస్ఎఫ్ బృందం

విశాలాంధ్ర-విజయవాడ : కృష్ణాజిల్లా వైఎస్సార్ తాడిగడప మునిసిపల్ పరిధిలోని శ్రీ చైతన్య పాఠశాలలో మౌలిక వసతులు కల్పించడంలో యాజమాన్యం పూర్తిగా వైఫల్యం చెందారని, ఫీజుల వసూళ్లలో ఉన్న శ్రద్ధ విద్యార్థులకు కల్పించాల్సిన వసతులపై ఏ మాత్రం లేదని అఖిల భారత విద్యార్థి సమాఖ్య (ఏఐఎస్ఎఫ్) జిల్లా అధ్యక్షులు మందగళ్ళ సాయికుమార్ ఆరోపించారు. రెండు రోజుల క్రితం స్థానిక శ్రీ చైతన్య పాఠశాల కానూరు ఐపీఎల్, ఎంపీఎల్ క్యాంపస్‌లో 10వ తరగతి విద్యార్థి ఎం.జస్వంత్ శ్రీ సాయి విద్యుదాఘాతంతో మరణించిన ఘటనా స్థలాన్ని శనివారం విద్యార్థి యువజన సంఘాల నాయకులు పరిశీలించారు. దీనిపై స్పెషల్ కమిటీ నియమించి సమగ్ర విచారణ జరిపించాలని వారు డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా మందగళ్ళ సాయికుమార్ మాట్లాడుతూ విద్యార్థి జస్వంత్ మరణానికి కేవలం యాజమాన్యం నిర్లక్ష్యమేనని అర్థం అవుతుందన్నారు. భవనానికి బయటి వైపు పెట్టాల్సిన ఏసీ అవుట్‌లెట్స్ లోపలి వైపు పెట్టారనీ, అక్కడ పిల్లలు బట్టలు ఆరబెట్టుకోవడానికి తాడు కట్టి బట్టలు ఆరబెట్టుకుంటున్నారనీ కనీసం వసతులు కల్పించటంలో యాజమాన్యం నిర్లక్ష్యం వహించి, బట్టల ఆరబెట్టుకోవడానికి ప్రత్యేక స్థలం కూడా కేటాయించలేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ విషయంపై జిల్లా విద్యాధికారులు సమగ్ర విచారణ జరిపించి ఇలాంటివి పునరావృతం కాకుండా చూడాలని, పాఠశాల గుర్తింపును రద్దు చేయాలని డిమాండ్ చేశారు. మరణించిన విద్యార్థి కుటుంబానికి నష్టపరిహారం ఇవ్వాలని కోరారు. ఈ ఘటనలో బాధ్యులైన వారిని కఠినంగా శిక్షించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ సహాయ కార్యదర్శి అయ్యప్ప, యువజన సమాఖ్య అధ్యక్షులు లంక గోవింద రాజులు , ఉపాధ్యక్షులు లంకె సాయి తదితరులు ఉన్నారు.

జనసేన ఆవిర్భావ సభను విజయవంతం చేయండి

విశాలాంధ్ర-మచిలీపట్నం : జనసేన పార్టీ పదవ ఆవిర్భావ సభను విజయవంతం చేయాలని మచిలీపట్నం జనసేన పార్టీ ఇంచార్జ్ బండి రామకృష్ణ పిలుపునిచ్చారు. శనివారం స్థానిక జనసేన పార్టీ కార్యాలయంలో పాత్రికేయుల సమావేశం ఏర్పాటు చేశారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆవిర్భావ సభకు ఏర్పాట్లు పూర్తి కావచ్చాయని ఈ సభకు మచిలీపట్నం, పెడన,అవనిగడ్డ,పామర్రు, గుడివాడ నుండి అత్యధిక సంఖ్యలో పార్టీ నాయకులు ,కార్యకర్తలు,వీర మహిళలు,అభిమానులు పాల్గొంటారని అంతే కాకుండా వివిధ జిల్లాల నుండి వచ్చే పార్టీ అభిమానులు సుమారు ఐదు లక్షల వరకు వుంటారని తెలిపారు.సభకు వచ్చే వారి కోసం 20 స్టాళ్ళ లో భోజనాలు ఏర్పాటు చేస్తున్నామని అలాగే స్నాక్స్, పుచ్చకాయ ముక్కలు,ఐదు లక్షల వాటర్ పాకెట్లు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. రాష్ట్ర అధ్యక్షుడు పవన్ కళ్యాణ్ మధ్యాహ్నం మంగళగిరి పార్టీ కార్యాలయం నుండి వారాహి వాహనంలో రోడ్డు మార్గాన సాయంత్రానికి మచిలీపట్నం చేరుకుంటారని తెలిపారు. ఈ సమావేశంలో తిరుపతి, నరసాపురం కన్వీనర్లు కిరణ్ రాయల్, రసూల్, వంపుగడల చౌదరి, గల్లా తిమోతీ పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గన్నారు.

నేడు గుమ్మడి విజయకుమార్‌కు సత్కారం

విశాలాంధ్ర-గుడివాడ : కృష్ణాజిల్లా వైఎస్ఆర్ పార్టీ సాంస్కృతిక విభాగం అధ్యక్షులుగా నిమితులైన గుమ్మడి జయరాజు కుమార్డు గుమ్మడి విజయకుమార్‌ను ఈనెల 12వ తేదీన కళాకారుల సమాఖ్య ఆధ్వర్యంలో సన్మాన సభను నిర్వహిస్తునట్లు కమిటి అధ్యక్షులు విన్నకోట సత్యనారయణ (పద్మామైక్ బుజి) శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ సమైఖ్య కమిటి ఆధ్వర్యంలో సాయంత్రం 6గం॥లకు స్థానిక శ్రీకన్యకాపరమేశ్వరి దేవస్తానం ప్రాంగణంలో గుమ్మడి విజయ కుమార్‌ను సత్కరిస్తు సన్మాన సభను ఏర్పాటు చేయడం జరగిందన్నారు. ఈ కార్యక్రమానికి వైసీపీ పట్టణ అధ్యక్షుడు గొర్ల శ్రీను, సమైఖ్య గౌరవ అధ్యక్షుడు బి.రామమోహనరెడ్డి, జవ్వాజి గంగరాజు, కె.ఎస్ అప్పారావులు ముఖ్య అతిధులు పాల్గొనడం జరుగుతుందన్నారు. సభలో సాంస్కృతిక కార్యక్రమలు శ్రీరామాంజనేయ యుద్ధం (వార్‌సీను), మ్యూజికల్ నైట్ కార్యక్రమలను ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమానికి ప్రతి ఒక్కరు పాల్గొని విజయవంతం చేయాలని బుజ్జి తన ప్రకటనలో కోరారు.

అక్రమ గ్యాస్ దందా...?

విశాలాంధ్ర-విస్సన్నపేట టౌన్: విస్సన్నపేటలో విజిలెన్సు అధికారులు అక్రమంగా తరలిస్తున్న రేషన్ బియ్యం కోసం తనిఖీలు జరుపుతుండగా, అనుకోని రీతిలో ఒక ప్రాంతంలో అక్రమంగా నిర్వహిస్తున్న గ్యాస్ దందా బయటపడటం అందరినీ ఆశ్చర్యానికి గురి చేసింది. విస్సన్నపేట మండలంలో గ్యాస్ ఏజన్సీల నుంచి పెద్దసంఖ్యలో గృహ వినియోగ వంటగ్యాస్ సిలిండర్లను అక్రమ మార్గంలో సాధించి, వాటిని రహస్యంగా ఇతర మార్గాల్లో వినియోగిస్తున్నారు. ప్రభుత్వం ఇచ్చే రాయితీ పోగా పేద, మధ్యతరగతి వర్గాలకు రూ.1,150లకు లోపుగా సిలిండర్లు విక్రయించాల్సి ఉంది. వీటిని ఆయా గ్యాస్ ఏజన్సీలు ఉచితంగా ఇంటికి రవాణా చేయాలనే ఆదేశాలు ఉన్నా, ఏజన్సీలు మాత్రం పెద్దమొత్తంలో రవాణా చార్జీలను వసూలు చేస్తున్నాయి. ఈ అవకాశాన్ని పలువురు అక్రమ వినియోగానికి వినియోగించుకుంటున్నారన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. గ్రామీణప్రాంతాల్లో నివసిస్తున్న పేదల నుంచి గ్యాస్ పుస్తకాలు సేకరించి, వారిపేరుతో సిలిండర్లు బుక్ చేసుకుంటున్నారు. వీటిని హెూటళ్లు, ఫంక్షన్‌హాళ్లు, తదితర ఇతరత్రా అవసరాలకు మండలకేంద్రమైన విస్సన్నపేటలో యధేచ్ఛగా విక్రయిస్తున్నారు. రవాణా చార్జీ లేకుండా ఎప్పుడు అవసరమైతే అప్పుడు సిలిండర్ సరఫరా చేస్తామనే హామీతో పేదల వద్ద ఉన్న వద్ద ఉన్న పుస్తకాలను దళారులు సేకరిస్తున్నారు. ఈ పుస్తకాల ఆధారంగా నిరాటంకంగా తమ అక్రమ వ్యాపారాన్ని కొనసాగిస్తున్నారు. ఇటీవల కొండపర్వలో విజిలెన్సు అధికారులకు అనుకోకుండా పట్టుబడిన గృహ వినియోగ సిలిండర్లతోపాటు, పెద్దసంఖ్యలో గ్యాస్ పుస్తకాలు సైతం లభించటం ఇందుకు నిదర్శనం. మరికొందరు దళారీలు మరో అడుగు ముందుకేసి, 'గ్యాస్ డంపింగ్' వ్యాపారం సైతం పెద్దఎత్తున సాగిస్తున్నట్లు వినికిడి.

గ్యాస్ డంపింగ్ అంటే...?

వ్యాపారస్తులు తప్పనిసరిగా వాణిజ్య అవసరాలకు రూపొందిస్తున్న 19 కిలోల గ్యాస్ సిలిండర్లనే వినియోగించాలి. గృహ వినియోగ సిలిండర్లు ఉపయోగిస్తే రెవిన్యూ, విజిలెన్సు అధికారులు కేసులు నమోదు చేయవలసి ఉంటుంది. ఈ సిలిండర్ ధర మార్కెట్లో ప్రస్తుతం సుమారు రూ.2,300ల వరకు ఉంది. గృహ వినియోగానికి వస్తున్న 14 కిలోల సిలిండర్ల నుంచి గ్యాస్‌ను వాణిజ్య అవసరాల ప్రత్యేక సిలిండర్‌లోకి డంపింగ్ చేసి, ఏజన్సీల కంటే తక్కువ ధరకు విక్రయాలు చేస్తున్నారు. ప్రధానంగా విస్సన్నపేట, చాట్రాయి, రెడ్డిగూడెం మండలాలకు చెందిన పలు గ్రామాల నుంచి పెద్దమొత్తంలో వ్యాపారకేంద్రమైన విస్సన్నపేటలోని వ్యాపార, వాణిజ్య సంస్థలకు అక్రమ మార్గంలో గ్యాస్ సిలిండర్లు రవాణా అవుతున్నాయి. అధికారులు గ్యాస్ దందాపై దృష్టి సారించాల్సిన అవసరం ఉందని ప్రజలు కోరుతున్నారు.

బాలలు సైబర్ ప్రమాదంపై అవగాహన ఉండాలి

విశాలాంధ్ర-విజయవాడ (గాంధీనగర్) : బాలలు సరైన అవగాహన లేక ప్రమాదం అంచున ఉంటున్నారని వారిని రక్షించడం ప్రతి ఒక్కరి బాధ్యత అని సైబర్ క్రైమ్ పోలీస్‌స్టేషన్ ఎస్ఐ ఆర్.ఎస్.ఆర్.సిహెచ్.మూర్తి తెలిపారు. శనివారం హనుమాన్‌పేటలోని టివి భవన్‌లో చైల్డ్ లైన్-1098, ఫోరం ఫర్ చైల్డ్ రైట్స్ వారు సంయుక్త నిర్వహణలో సైబర్ క్రైమ్ పోలీస్ స్టేషన్ సహకారంతో సైబర్ క్రైమ్ అవగాహనా,ఆన్‌లైన్ సెఫ్టి ఫర్ చిల్డ్రన్స్ అనే అంశంపై వర్క్ షాపు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రస్తుతం అవగాహన లేక చాలా మంది బాలలు ఫోన్, కంప్యూటర్, నెట్ వాడకం అవగాహన చైతన్యం లేకపోవడం వల్ల సైబర్ ప్రమాదం అంచున పడుతున్నారన్నారు. చైల్డ్‌లైన్-1098 టీం వారు ఈ సైబర్ నేరాలపట్ల, ఆన్‌లైన్ సేఫ్టీ పట్ల అవగాహన పెంచుకుని బాలలకు-యువతకు అవగాహన కల్పించాలన్నారు. సైబర్ నేరాలు 27 రకాలు ప్రస్తుతం ఉన్నాయని అపరిచుతులతో, అపరిచిత యాప్స్‌తో, ఈ మెయిల్ తో ఓటిపిలతో జాగ్రత్తగా ఉండాలన్నారు. బాలలు ఎదుర్కొంటున్న సమస్యలపై పెద్దలకు - తల్లి దండ్రులకు అవగాహన కల్పించాలని, ఉమ్మడి కుటుంబాల వ్యవస్థ సమాజ పటిష్టతకు మూలం అన్నారు. అపరిచిత వ్యక్తులతో చాటింగ్ చేయకుడదని జరుగతున్న నేరాలకు 99% కారణాలు స్మార్ట్ ఫోన్ అని పిల్లలు ఫోన్ -నెట్ వాడకం పై తల్లిదండ్రులు అజమాయిషీ- నిఘా ఉండాలని పాస్వర్డ్ లాక్ మార్చాలని అన్నాను. ఆన్‌లైన్ సైబర్ మోసాల వల్ల చాలా మంది జీవితాలను కోల్పోతున్నారని, ముఖ్యంగా బాలలు ఆన్ లైన్ గేమ్ ఇతర యాప్స్ వల్ల వారికి తెలియకుండానే ప్రమాదంలో పడిపోతున్నారని వారిలో అవగహన కల్పించాలన్నారు. ఈ కార్యక్రమంలో చైల్డ్ లైన్ సెంటర్ కోఆర్డినేటర్ పి.నాగరాజు, వర ప్రసాద్,కె. ప్రకాష్ కుమార్, తదితరులు పాల్గొన్నారు.

విశాలాంధ్ర
ఎన్టీఆర్ జిల్లా

నేడు బస్టాండ్ వద్ద ఆటోవర్కర్స్ యూనియన్ ధర్నా

విశాలాంధ్ర-విజయవాడ : పెంచిన సీఎన్జీ గ్యాస్, పెట్రోలు, డీజిల్ పెరుగుదలను నిరసిస్తూ ఆదివారం ఉదయం 10:00 గంటలకు పండిట్ నెహ్రూ బస్‌స్టేషన్ సిటీ టర్మినల్ వద్ద వినూత్న నిరసన చేస్తారని ఆటో వర్కర్స్ యూనియన్ నగర గౌరవ అధ్యక్షులు దోనేపూడి శంకర్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు.

మహిళా ఉపాధ్యాయులకు సత్కారం

విశాలాంధ్ర-విజయవాడ : జక్కంపూడి వైఎస్సార్ కాలనీలోని విజయవాడ రూరల్ మండలం మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో పని చేస్తున్న 13 మంది మహిళా ఉపాధ్యాయులను అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని పాఠశాలలో పనిచేయుచున్న 13 మంది ఉపాధ్యాయురాలను ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమానికి మండల విద్యా శాఖ అధికారి ఏ. వెంకటరత్నం అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అక్షరాభ్యాసం చేసుకుని పాఠశాలలో అడుగుపెట్టిన చిన్నారులకు వారికి అర్థం అయ్యే రీతిలో ఎంతో ఓర్పుతో పాఠాలు బోధిస్తున్నారని ఉపాధ్యాయులను అభినందించారు. తల్లిదండ్రుల తరువాత పిల్లలు ఎక్కువ సమయం గడిపేది టీచర్స్‌తోనే అన్నారు. బాలల భవిష్యత్‌కు బాటలు వేసేది ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయులే అన్నారు. పాఠశాల ప్రధాన ఉపాధ్యాయుడు షేక్. యూసఫ్ సమక్షంలో పాఠశాలలో పనిచేస్తున్న ఉపాధ్యాయులు మహిళా టీచర్లను ఘనంగా సత్కరించడమైనది. జక్కంపూడి పాఠశాలలో మహిళా ఉపాధ్యాయులను, ఎంపీటీసీ, జడ్పీటీసీ మహిళలను సన్మానించారు. ముఖ్యంగా విజయవాడ రూరల్ మండలం అధ్యక్షురాలు ప్రసన్న కుమారిని దుశ్శాలువాతో ఘనంగా సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు.

సీఎన్జీ గ్యాస్ ధరలు ఏపీకి భారం
గుజరాత్‌కి మినహాయింపా ?

విశాలాంధ్ర-విజయవాడ(చిట్టినగర్) : పెంచిన సీఎన్జీ గ్యాస్ ధరలు ఆంధ్రప్రదేశ్‌కి భారం, గుజరాత్‌కు మినహాయింపా ఆటోవర్కర్స్ యూనియన్ (ఏఐటీయూసీ) నగర గౌరవాధ్యక్షుడు దోనేపూడి శంకర్ సందేహం వెలిబుచ్చారు. పెరిగిన సీఎన్జీ, పెట్రో ఉత్పత్తుల ధరాభారాన్ని మోయలేని పరిస్థితుల్లో తాడులతో ఆటోని లాగుతూ ఏఐటీయూసీ ఆటో కార్మిక సంఘాల వినూత్న నిరసన కార్యక్రమాన్ని శని వారం పైపులరోడ్డు ప్రాంతంలో చేపట్టారు. ఈ కార్య క్రమంలో పాల్గొన్న ఆయన మాట్లాడుతూ సీఎన్జీ గ్యాస్ ధర గుజరాత్‌లో 79.59 వుందని మన రాష్ట్రం లో వందకు చేరిందని మన రాష్ట్రం చేసుకున్న పాపం ఏమిటి? అని ప్రశ్నించారు. ఒక ప్రక్క నిత్యావసర సరుకుల ధరలు భారం మరొక ప్రక్క సీఎన్జీ ధరల భారాలతో ఆటో కార్మికులు ఆర్థికంగా కుంగిపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. సామాన్యుల బాధలు కేంద్ర ప్రభుత్వానికి పట్టటలేదని విమర్శించారు. సీఎన్జీ గ్యాస్ తగ్గించాలని లేని పక్షంలో ఉద్యమాన్ని ఇంకా ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఏఐటీయూసీ నగర కార్యదర్శి కొట్టు రమణారావు, సీపీఐ నగర నాయకులు కేవీ భాస్కరరావులు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం ఇష్టానుసారంగా ధరలు విపరీతంగా పెంచుతుందని ప్రజా ఉద్యమ ఆగ్రహానికి గురికాక తపదన్నారు. ఈ కార్యక్రమంలో యూనియన్ నగర ప్రధాన కార్యదర్శి గూడెల జనార్ధన్, నగర అధ్యక్షులు ఎర్ర రాములు, యూనియన్ నాయకులు కమ్మిలి శ్రీను, కోల మూర్తి, మెట్టు సాంబశివరావు, ఏఐవైఎఫ్ ఎన్టీఆర్ జిల్లా అధ్యక్షులు లంకా గోవిందరాజులు, నగర నాయకులు లంకె సాయి, స్థానిక సీపీఐ కార్యదర్శి ఎస్ కే సుభాని, కే. ఆదినారాయణ పాల్గొన్నారు. ఆద్యంతం ఈ కార్యక్రమాన్ని ప్రజలు ఆసక్తిగా తిలకించారు.

వృద్ధులకు రాయితీలు కల్పించాలి
ఎంపీకి వరిష్ట పౌరుల సంఘం వినతి

విశాలాంధ్ర-విజయవాడ : దేశంలో వరిష్ట పౌరులకు రైళ్ల ప్రయాణంలో కల్పిస్తున్న టిక్కెట్ రాయితీలు కోవిడ్ లాక్ డౌన్ సందర్భంలో రద్దు చేయడం జరిగిందని , వాటిని మరలా పునరుద్ధించాలని కోరుతూ కృష్ణాజిల్లా వృద్ధుల (వరిష్ట) సంక్షేమ సంఘం ప్రధాన కార్యదర్శి మోతుకూరి వెంకటేశ్వరరావు, కోశాధికారి దావులూరి సాంబశివరావులు కోరారు. ఈ మేరకు శనివారం విజయవాడ లోక్ సభ సభ్యులు కేశినేని శ్రీనివాస్‌ను ఆయన కార్యాలయంలో కలిసి వినతి పత్రం అందజేశారు. రాబోయే పార్లమెంట్ సమావేశాల్లో చర్చించి వృద్ధుల సంక్షేమ చట్టాలు రైళ్ల ప్రయాణంలో రాయితీ లు అమలు కోసం తోడ్పడాలని కోరారు.

ఎస్సీ రైల్వేలో టిక్కెట్ తనిఖీలలో రూ.200 కోట్లు

విశాలాంధ్ర-విజయవాడ (గాంధీనగర్) : టిక్కెట్ తనిఖీల ద్వారా ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో రూ. 200 కోట్ల ఆదాయాన్ని దక్షిణ మధ్య రైల్వే నమోదు చేసింది. ఏ సం.లేని విధంగా టిక్కెట్ తనిఖీలో ఇదే అత్యధిక ఆదాయం. ఈ ఆర్థిక సంవత్సరంలో ప్రయాణీకులు, సరకు రవాణా వ్యాపారం ఇలా రెండింటిలోనూ అత్యుత్తమ పనితీరును కనబరుసుంది.రూ.200.17 కోట్ల అత్యధిక ఆదాయాన్ని నమోదు చేయడం ద్వారా టిక్కెట్ తనిఖీ ప్రక్రియలో మరో మైలురాయిని సాధించింది. టికెట్ లేని ప్రయాణం, ముందుగా బుక్ చేయని లగేజి మొదలైన వంటి వాటిమీద విధించిన జరిమాన ద్వారా 28.27 లక్షల కేసుల ద్వారా ఈ ఆదాయం ఆర్జించింది. ఇంతకముందు 2019-20లో టిక్కెట్ తనిఖీల ద్వారా అత్యధికంగా రూ. 154.29 కోట్లు లభించింది. టిక్కెట్ లేని ప్రయాణం,సరైన ఆధారాలు లేకుండా ప్రయాణించకుండా వుండేందుకు రైల్వే తనిఖీ సిబ్బంది ముఖ్యమైన పాత్ర పోషిస్తుంది.తద్వారా రైల్వేల బుకింగ్ విండో విక్రయాలను పెంచడానికి మార్గం సుగమం చేస్తుంది. ఈ ఆర్థిక సంవత్సరంలో ఇప్పటివరకు, దక్షిణ మధ్య రైల్వే టిక్కెట్ తనిఖీలో అత్యధిక ఆదాయంతో పాటు రూ. 4825.72 కోట్ల ప్రయాణీకుల ఆదాయాన్ని అత్యధికంగా ఆర్జించింది.ఈ సందర్భంగా దక్షిణ మధ్య రైల్వే జనరల్ మేనేజర్ అరుణ్ కుమార్ జైన్ మాట్లాడుతూ గతంలో ఏ సంవత్సరంలోనైనా మొదటిసారి టిక్కెట్ తనిఖీ లో రూ. 200 కోట్ల ఆదాయాన్ని దాటినందుకు అధికారులు, సిబ్బంది మొత్తం వాణిజ్య విభాగాన్ని ఆయన అభినందించారు.

అంగన్వాడీల అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి : ఎమ్మెల్యే

విశాలాంధ్ర-కంచికచర్ల : కీసరలో అంగన్వాడీ ప్రీ ప్రైమరీ స్కూలును ఎమ్మెల్యే డాక్టర్ మొండితోక జగన్‌మోహన్‌రావు శనివారం పరిశీలించి సిబ్బందితో మాట్లాడి, పిల్లలతో ముచ్చటించారు. అనంతరం సచివాలయంలో స్థానిక ప్రజా ప్రతినిధులు-పార్టీ నాయకులతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అంగన్వాడీల అభివృద్ధికి ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నారని, అంగన్వాడీలకు శాశ్వత భవనాలను నిర్మించడానికి ప్రత్యేక నిధులు కేటాయించడంతో పాటు బాలింతల -శిశువుల సంక్షేమం కోసం వారికి పౌష్టికాహారం అందజేయడం కోసం పెద్ద ఎత్తున ప్రభుత్వ ఖర్చు పెడుతుంది అని గుర్తు చేశారు, గ్రామ సచివాలయం -రైతు భరోసా కేంద్రం -వైయస్సార్ విలేజ్ హెల్త్ క్లినిక్ భవనాల నిర్మాణాలపై ప్రత్యేక చొరవ తీసుకోవాలని ముఖ్యమంత్రి వైయస్ జగన్ మోహన్ రెడ్డి ఆదేశాలకు -ఆలోచనలు అనుగుణంగా పార్టీ నాయకులు, స్థానిక ప్రజాప్రతినిధుల పని చేయాలన్నారు, త్వరలోనే ప్రభుత్వం పెండింగ్ బిల్లులను క్లియర్ చేస్తుందని చెప్పారు, అనంతరం గ్రామంలో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలపై కూడా ప్రత్యేకంగా చర్చించారు, గ్రామంలో డ్రైనేజీల నిర్మాణాలకు ప్రణాళికలు రూపొందించాలని అధికారులను ఆదేశించారు, రానున్న వేసవిని దృష్టిలో ఉంచుకొని తాగునీటి సరఫరా పై చర్యలు చేపట్టాలన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ పేరం నర్సమ్మ, జడ్పిటిసి వేల్పుల ప్రశాంతి రమేష్, వైస్ ఎంపీపీ బండి మల్లికార్జునరావు, ఉప సర్పంచ్ ప్రభాకర్, ఎంపీటీసీ స్వామి, నాయకులు పరిటాల రామ కోటేశ్వరరావు, వెలగలేటి బాబు, దావీదు తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన తిరుపతమ్మ చిన్న తిరునాళ్ల

విశాలాంధ్ర-పెనుగంచిప్రోలు : తిరుపతమ్మ అమ్మవారి చిన్న తిరుణాళ్ల మహోత్సవాలు వైభవంగా ఆలయ ఈఓ జీవిడి ఎన్. లీలా కుమార్, చైర్మన్ ఇంజం. కేశవరావు, ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ ఐదు రోజులు లక్షల మంది భక్తులు అమ్మవారిని దర్శించుకున్నారు. పెద్ద సంఖ్యలో భక్తులు తరలివచ్చారు. మున్నేటిలో పవిత్ర స్నానాలు చేసి, పాలు పొంగళ్ళు పొంగించుకొని, పిల్లా పాపలతో అమ్మవారిని దర్శించుకొని మొక్కులు తీర్చుకున్నారు. వచ్చిన భక్తులకు ఇబ్బంది కలుగకుండా ఎప్పటికప్పుడు ట్యాంకర్లతో రోడ్లు తడుపుతూ, తాగునీటిని భక్తులకు అందుబాటులో ఉంచారు. ప్రభుత్వ ఆసుపత్రి ఆధ్వర్యంలో భక్తులకు డాక్టర్ ఇందిరా, వైద్య సిబ్బంది ఎప్పటి కప్పుడు అందుబాటులో ఉండేలా క్యాంపులు నిర్వహించారు. గ్రామంలో తిరుణాళ్ల సందర్భంగా ట్రాఫిక్ సమస్య లేకుండా నందిగామ ఏసీపీ నాగేశ్వరరెడ్డి ఆధ్వర్యంలో జగ్గయ్యపేట సీఐ నాగమురళి పర్యవేక్షణలో స్థానిక ఎస్ఐ హరిప్రసాద్ బందోబస్త్ నిర్వహించి ఎప్పటి కప్పుడు ట్రాఫిక్‌ను నియంత్రిస్తూ భక్తులకు ఇబ్బందులు కలుగకుండా తగు జాగ్రత్తలు తీసుకున్నారు. సర్పంచ్ వేల్పుల పద్మకుమారి, కార్యదర్శి జి. శ్యాంకుమార్, గ్రామ అభివృద్ధి కమిటీ చైర్మన్ వేల్పుల. రవికుమార్ మున్నేరులో, పారిశుధ్య కార్మికులతో ఎప్పటికప్పుడు పారిశుధ్యంపై తగ్గు జాగ్రత్తలు తీసుకున్నారు. చిన్న తిరుణాళ్ల మహోత్సవాలు విజయవంతానికి కృషి చేసిన అన్ని శాఖల అధికారులు, సిబ్బందికి పేరుపేరునా ఆలయ ఈఓ, చైర్మన్‌లు కృతజ్ఞతలు తెలిపారు.

ఆర్టీసీ బస్సు, బైక్ ఢీ ఇద్దరు మృతి
మరోకరి పరిస్థితి విషమం

విశాలాంధ్ర-విజయవాడ క్రైం: విజయవాడ రూరల్ నున్న రోడ్డులో శనివారం ఘోర రోడ్డు ప్రమాదం జరిగింది. ఆర్టీసీ బస్సు, ద్విచక్రవాహం ఢీకొన్న ఘటనలో ఇద్దరు మృతి చెందారు. మరొకరి పరిస్థితి విషమం ఉంది. మృతులు బావాజీ పేటకు చెందిన శేషపు రవి(36), లూనా సెంటర్ సింగ్‌నగర్‌కు చెందిన దేవర్ల నాగరాజు(32) మృతి చెందగా, సింగ్‌నగర్‌కు చెందిన షేక్.యూసఫ్ బాషా(34) ప్రాణాలతో కొట్టుమిట్టడుతున్నాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం ఈ ముగ్గురు స్నేహితులు కలిసి నగరంలో టైల్స్ పనులు చేస్తూ జీవనం సాగిస్తున్నారు. అయితే భోజనం కోసం కండ్రిక నుండి నున్న గ్రామం పైపు ద్విచక్రవాహం పై వెళ్లార తిరుగు ప్రయాణంలో సత్యనారాయణ సమాధుల వద్ద వచ్చేసరికి విజయవాడ నుండి విస్సనపేటకు వెళ్లే ఆర్టీసీ వస్తుంది.దీంతో ద్విచక్రవాహం, ఆర్టీసీ బస్సు ఢీకొన్న ఘటనలో రవి అక్కడిక్కడే మృతి చెంగా, నాగరాజు ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందాడు. మరోకరు తీవ్రగాయాలతో పరిస్థితి విషమం ఉంది. ఈమేరకు పాయకాపురం పోలీసులు కేసు నమోదు చేసి మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

కార్మికుని కుటుంబానికి ఆర్థిక సాయం

విశాలాంధ్ర-విస్సన్నపేట టౌన్: విస్సన్నపేట మండలం పుత్రేలకు చెందిన కార్మికుని కుటుంబానికి సహ కార్మికులు తమ సంఘం తరఫున ఆర్థికసాయం అందజేశారు. గ్రామానికి చెందిన పూర్ణాచారి అనారోగ్య కారణాలతో ఇటీవల మృతి చెందారు. ఆయన కుటుంబసభ్యులు పేదరికంతో బాధ పడుతుండగా, పుత్రేల యూనిట్ మోటార్ ఫీల్డ్ యూనియన్ తమవంతు సాయమందించేందుకు ముందుకొచ్చారు. యూనియన్ అధ్యక్షుడు బట్టగాని రవీంద్రబాబు ఆధ్వర్యంలో రూ.10,100ల నగదును మృతుని కుటుంబసభ్యులకు అందజేశారు. కార్యక్రమంలో సంఘం నాయకులు గాదం నాగేశ్వరరావు, కారుమంచి సురేష్, కె.మురళి, ఎండీ అమ్జాన్ తదితరులు పాల్గొన్నారు.

రంజింప చేసిన చిత్ర గీతాలాపన

విశాలాంధ్ర-విజయవాడ కల్చరల్ : ఆల్ ఇండియా పద్మశ్రీ ఘంటసాల చైతన్య వేదిక, తెలుగు కళావాహిని,జి ఆర్ కె పోలవరపు సాంస్కృతిక సమితి, శ్రీ కళాభారతి సంయుక్త ఆధ్వర్యంలో శనివారం సాయంత్రం కౌత పూర్ణానందం సత్రం కళావేదికపై జరిగిన సినీ సంగీత విభావరి ఆహుతులను రంజింప చేస్తూ సాగింది. మోహన్ రాజ్,డేవిడ్ రాజ్,కోట వెంకటేశ్వరరెడ్డి, శ్రీనివాసరావు, రాజేష్, విజయశ్రీ, శ్రీ దుర్గానాగమణి, పద్మ, కామేశ్వరి, షబనలు పలు చిత్రాలలోని పాటలను శ్రావ్యంగా పాడి వినిపించారు. పర్యవేక్షణ చింతకాయల చిట్టిబాబు చేశారు. భగత్‌సింగ్ అమరత్వం అభ్యుదయ భావజాలం నేటి సమాజానికి సందేశం అనే అంశంపై సమావేశం జరిగింది. కోట వెంకటేశ్వరరెడ్డి మాట్లాడుతూ భారతదేశానికి భగత్ సింగ్ అభ్యుదయ భావజాలమే దిక్సూచి కావాలని అన్నారు.

గంజాయి అమ్ముతున్న వ్యక్తి అరెస్ట్

విశాలాంధ్ర-పమిడిముక్కల: మండల పరిధిలోని కె.సి.పి.ఫ్లై ఓవర్ సమీపంలో గంజాయి అమ్ముతున్నట్లు కృష్ణా జిల్లా జిల్లా ఎస్పీ జాషువా సమాచారం మేరకు ఎస్.ఐ.సత్యనారాయణ మేరుగుమాల విజయ సాయి ని అదుపులోకి తీసుకున్నట్లు తెలిపారు. శనివారం కె.సి.పి.ఫ్లై ఓవర్ సమీపంలో గంజాయి అమ్ముతున్నట్లు ఎస్పీ కి సమాచారం రావటంతో గుడివాడ డిఎస్పీ సత్యా నందం ఆదేశాలతో సి.ఐ. యం.కిషోర్ పర్యవేక్షణలో ఎస్.ఐ.సత్యనారాయణ సిబ్బంది మరియు రెవిన్యూ అధికారులు గంజాయి అమ్ముతున్న వ్యక్తి మేరుగుమాల విజయ సాయి ని అదుపులోకి తీసుకుని 2.2 కేజీ ల గంజాయి ని స్వాధీనం చేసుకుని ఎన్.డి.పి.ఎస్.చట్టం కింద కేసు నమోదు చేశామని తెలిపారు.ఈ సందర్భంగా ఎస్.ఐ.సత్యనారాయణ మాట్లాడుతూ ఎవ్వరైనా గంజాయి రవాణా చేసినా అమ్మినా నెరమేనని చట్ట ప్రకారం చర్యలు తీసుకుంటామని తెలిపారు.

నిరుద్యోగులను మోసంచేసిన జగన్ : మండలి

విశాలాంధ్ర-అవనిగడ్డ : నిరుద్యోగులను మోసగించ డమే రాష్ట్ర ముఖ్యమంత్రి జగన్‌మోహన్ రెడ్డి ఆశయం అని మాజీ ఉపసభాపతి మండలి బుద్ధప్రసాద్ అన్నారు. శనివారం మండలి తన కార్యాలయంలో విలేకరులతో మాట్లాడుతూ వై.సి.పి ప్రభుత్వం అధికారంలోకి వస్తే మేగా డి.ఎస్.సి ఇస్తామని నమ్మించి అధికారంలోకి వచ్చాక ఆ ఊసే ఎత్తకపోవడం నిరుద్యోగులను మోసగించడమే అని అన్నారు. రాష్ట్రంలోని పలు జిల్లాల నుండి అవనిగడ్డ లో డి.ఎస్.సి కోచింగ్ తీసుకుంటున్న విద్యార్థులు మండలి బుద్ధప్రసాద్‌ను కలిసి తమ గోడు విన్నవించారన్నారు. డి.ఎస్.సి ఇస్తారని నమ్మకంతో సుదీర్ఘ ప్రాంతాల నుండి వచ్చి కోచింగ్ తీసుకుంటే డి.ఎస్.సి ఇస్తారో ఇవ్వరో కూడా ప్రభుత్వం తేల్చి చెప్పకపోవడంతో అయోమయంలో ఉన్నారని మాట తప్పని మడం తిప్పను అని చెప్పుకునే ముఖ్యమంత్రి డి.ఎస్.సి విషయంలో మాట తప్పారని బుద్ధప్రసాద్ విమర్శించారు. ముఖ్యమంత్రికి చిత్తశుద్ధి ఉంటే వెంటనే డి.ఎస్.సి ప్రకటించి పాదయాత్ర సమయంలో ఇచ్చిన హామిని నిలబెట్టుకోవాలన్నారు. ప్రతి 6 నెలలకు ఒకసారి నిర్వహించవలసిన టెట్, ఆర్.టీ.యాక్ట్ కూడా నిర్వహించకపోవడం ఆశ్చర్యకరమని ఉపాధ్యాయులపై కక్ష్య కట్టి వ్యవహరిస్తూ విద్యారంగాన్ని ఏవిధంగా ముందుకు తీసుకువెళ్తారని మండలి ప్రశ్నించారు. డి.ఎస్.సి కోసం రాష్ట్ర వ్యాప్తంగా 6,50,000 మంది ఎదురు చూస్తున్నారని వారి వయో పరిమితి కూడా దాటిపోతుందని భాదపడుతున్నారన్నారు. శాసన సభ సమావేశాలలోనైనా డి.ఎస్.సి ప్రకటన చేయాలని మండలి కోరారు.

పరీక్ష ప్యాడ్లు పంపిణీ

విశాలాంధ్ర-నందిగామ : నందిగామ వరల కంపెనీ ఏసుక్రీస్తు ప్రార్థన మందిరంలో ఫెలో జూనియ గాస్పల్ సొసైటీ ఆధ్వర్యంలో విద్యార్థులు ఎగ్జామ్ ప్యాడ్లు, పుస్తకాలు,నోట్ బుక్స్ పంపిణీ చేశారు. బి.సత్యపాల్ పాస్టర్ గోసంగి జాన్ బాబు, పాస్టర్ మద్రి రాజారావు ఆధ్వర్యంలో విద్యార్థులకు ఉచితముగా ఎగ్జామ్ ప్యాడ్స్ , పెన్నులు , నోట్ బుక్స్ పంపిణీ చేశారు. ఏజీపీ మట్టా ప్రసాద్ , నందిగామ వాకర్స్ ప్రెసిడెంట్ శ్రీరామ్ మూర్తి , టెన్త్ క్లాస్ విద్యార్థులు పాల్గొన్నారు.

తునికిపాడులో గడపగడపకు మన ప్రభుత్వం

విశాలాంధ్ర-గంపలగూడెం : పేదల పక్షపాతి మన ముఖ్య మంత్రి వైయస్ జగన్మోహన్ రెడ్డి ఏనని తిరువూరు నియోజకవర్గ శాసనసభ్యులు కొక్కిలిగడ్డ రక్షణ నిధి అన్నారు. శనివారం నాడు శాసనసభ్యులు రక్షణ నిధి గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా తునికిపాడు గ్రామంలో పర్యటించి గ్రామ ప్రజలకు మన ముఖ్యమంత్రి చేసిన ప్రజా సంక్షేమ అభివృద్ధి కార్యక్రమాలను వివరించి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఎంపీపీ జి శ్రీలక్ష్మి, జడ్పిటిసి సభ్యులు కోట శ్యాముల్, జిల్లా వైయస్సార్సీపి స్టీరింగ్ కమిటీ సభ్యులు చెరకు నర్సారెడ్డి, చెన్నకేశవరెడ్డి, మండల కన్వీనర్ సిహెచ్ వెంకటేశ్వరరావు, పలువురు ప్రభుత్వ అధికారులు, ప్రజా ప్రతినిధులు, నేతలు, కార్యకర్తలు పాల్గొన్నారు.

పిల్లల చదువు, ఆరోగ్యంపై తల్లిదండ్రులు శ్రద్ధతీసుకోవాలి

విశాలాంధ్ర-పెనుగంచిప్రోలు : పదవ తరగతి పరీక్షలు దగ్గర పడుతున్న సమయంలో పిల్లల చదువు, ఆరోగ్యం పట్ల తల్లి దండ్రులు శ్రద్ధ తీసుకోవాలని కెవిఆర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల పేరెంట్స్ కమిటీ చైర్మన్ బత్తుల వెంకటనర్సు, ప్రధానోపాధ్యాయురాలు కె జలజ సూచించారు. శనివారం ఉదయం పాఠశాలలో ముక్కా సత్యనారాయణ అధ్యక్షతన జరిగిన సమావేశంలో వారు పాల్గొని పిల్లల పరిస్థితి, చదువు, హాజరు వంటి విషయాలు, పరీక్షలు జరిగే విధానం గురించి చర్చించారు. ఉపాధ్యాయులతో ఎప్పటికప్పుడు వారి పిల్లల ప్రగతి గురించి సమన్వయం చేసుకోవాలని తెలిపారు. కొందరు పిల్లల తల్లిదండ్రులు కూడా వారి అభిప్రాయం తెలిపారు. సీనియర్ ఉపాధ్యాయులు పొడుగు శ్రీనివాసరావు, స్టాఫ్ సెక్రటరీ జి వి రామకృష్ణ, ప్రభుదాస్, రాములు, సి ఆర్ పి జొన్నలగడ్డ గోపాల్, నాగేశ్వరరావు, పద్మ తదితరులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో దాదాపు డెబ్బై మంది విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

గ్రామ పంచాయతీ కార్యాలయము - వేమిరెడ్డిపల్లి
విస్సన్నపేట మండలం, యన్.టి.ఆర్.జిల్లా

ఆర్.సి.నెం : నిల్/2023 **టెండర్ ప్రకటన** తేది : 10-03-2023

ఎన్.టీ.ఆర్ జిల్లా, విస్సన్నపేట మండలం, వేమిరెడ్డిపల్లి గ్రామ పంచాయతీ నందు **2023-2024** సంవత్సరమునకు అనగా **డి.01-04-2023 నుండి డి.31.03.2024** వరకు కాంట్రాక్టు పద్ధతిపై కాంట్రాక్టు లేబరును, రోజువారి వేతనంపై దిగువ తెలిపిన విధులు నిర్వర్తించుటకు గాను **డి. 21.03.2023 మంగళవారం మధ్యాహ్నం 3గం॥లకు** పంచాయితీ కార్యదర్శి వారిచే గాని లేక వారి అనుమతి పొందిన వారిచే గాని సీల్డు టెండర్లు స్వీకరించబడును. సదరు టెండర్లు అదేరోజు సాయంత్రం 4గం॥లకు హాజరైన టెండర్లు దారులు సమక్షంలో తెరవబడును. మిగిలిన షరతులు కార్యాలయం పనివేళల యందు అడిగి తెలుసుకోవచ్చును.

వ.నెం	పని వివరము	కావలసిన వ్యక్తుల సంఖ్య	పని కాలము	ధరావత్తు
1.	పారిశుధ్య నిర్వహణ	02	01-04-2023 టు 31-03-2024	1000/-
2.	వీధి లైట్లు నిర్వహణ	01	01-04-2023 టు 31-03-2024	1000/-
3.	మంచినీటి నిర్వహణ	02	01-04-2023 టు 31-03-2024	1000/-

గమనిక :- 1. గతంలో పనిచేసిన వారికి ప్రాధాన్యత ఇవ్వబడును
2. పంచాయితీలో నిధుల నిల్వలను బట్టి చెల్లింపులు జరుపబడును.

పంతంగి విజయకుమారి,
సర్పంచ్, వేమిరెడ్డిపల్లి గ్రామపంచాయతీ

ఎస్. రామారావు,
పంచాయతీ కార్యదర్శి, వేమిరెడ్డిపల్లి గ్రామపంచాయతీ

జనాభా ప్రాతిపదికన సీట్లు కేటాయించాలి

విశాలాంధ్ర-విజయవాడ (గాంధీనగర్) : కల్లుగీసే కులాలకు రానున్న ఎన్నికల్లో జనభాప్రాతిపదికన ఎన్నికల్లో పోటీచేసే విధంగా అన్ని రాజకీయ పార్టీలు అవకాశం కల్పించాలని రాజ్యాధికార పార్టీ జాతీయ అధ్యక్షులు వి.జీ.ఆర్.నారగోని డిమాండ్ చేశారు. శనివారం గాంధీనగర్‌లోని ప్రెస్‌క్లబ్‌లో గౌడ మహాసభ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో కల్లుగీసే కులాలను గౌడ, ఈడిగ,శ్రీ శయన, శెట్టి బలిజ పేరులతో పిలుస్తారన్నారు. ఎన్నికల సమయంలో మాత్రమే వీరు పార్టీలకు గుర్తుకు వస్తారన్నారు.ప్రతి సారి తమను ఓటు బ్యాంకుగా మాత్రమే పరగణిస్తున్నారన్నారు. తమ సమస్యలు పరిష్కారానికి కృషి చేస్తున్నావారు లేక సమస్యలు ఎక్కడవేసి గోంగళలాగా ఉంటున్నాయన్నారు.రాష్ట్రంలో 2 కులాలు అగ్రవర్ణాలు మాత్రమే పరిపాలిస్తున్నాయని రాజ్యాధికారాన్ని అన్ని వర్గాలకు సమానంగా పంపిణీ చేయవలసిన సమయం ఆసన్నమైందన్నారు. రాష్ట్రంలో బీసీలు ముఖ్యమంత్రి కావాలని కోరిక ఒక్కసారైనా ఈ రాష్ట్రాన్ని పరిపాలించాలని అకాంక్షించారు.సభకు అధ్యక్షత వహించిన నగర అధ్యక్షులు వీరంకి అయ్యన్న గౌడ్,రాష్ట్ర జనరల్ సెక్రటరీ అత్తెలి రాజు గౌడ్ మాట్లాడుతూ గతంలో పరిపాలించి,ప్రస్తుం పాలిస్తున్న వైసిపి కాని సరైన ప్రాతినిధ్యం ఇవ్వలేదన్నారు.ఎంతసేపు వాడుకోవటం అధికారంలోకి వచ్చాక చిన్నచిన్న పదవులు ఇచ్చి మోసం చేస్తున్నారన్నారు.ప్రభుత్వం ఏర్పాటు చేసిన గౌడ కార్పొరేషన్ కి నిధులు కేటాయింపులు లేవని అన్నారు. ఈ కార్యక్రమంలో యెనుముల భాస్కర్ గౌడ్, దానా గౌడ్, నరసింహారావు,కుడుపూడి మహేశ్వర రావు, పాలగాని దుర్గారావు, రాజా శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

ఉపాధి హామీ పనులు వేగవంతం చేయాలి

విశాలాంధ్ర-కంచికచర్ల: ఎన్టీఆర్ జిల్లా డ్వామా ప్రాజెక్ట్ డైరెక్టర్ సునీత శనివారం మండలంలోని పలు గ్రామాల్లో పర్యటించారు కంచికచర్ల లోని వర్మి కంపోస్ట్ యూనిట్ ను పరిశీలించారు. తడి పొడి చెత్త లను కుండీలలో మాత్రం వేయాలని సూచించారు. ఈ యూనిట్ ను మరింతగా అభివృద్ధి చేసి ఆ కుండీలలో ఆకుకూరలు పెంచాలని సూచించారు. అనంతరం మండలంలోని కొత్తపేట గ్రామంలో చెరువును పరిశీలించారు ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మండలంలోని ప్రతి గ్రామంలోనూ ఉపాధి హామీ పనులను గుర్తించి పని అడిగిన ప్రతి ఒక్కరికి పని కల్పించాలని అన్నారు. ఈ కార్యక్రమంలో మండల అభివృద్ధి అధికారి బాల శంకర్ ఏపీవో శరత్ ఫీల్డ్ అసిస్టెంట్, మెట్లు తదితరులు పాల్గొన్నారు.

CHANGE OF NAME

I, **PATCHIGOLLA KRISHNA KISHORE** (Old Name), S/o PATCHIGOLLA SRISAILA MALLIKHARJUNA RAO, R/o 11-45-141, Tavva Vari Street, I Town, Vijayawada -520001, NTR(D), A.P., India have changed my Name to **PACHIGOLLA KRISHNA KISHORE,** Here after my name is known as **PACHIGOLLA KRISHNA KISHORE**

CHANGE OF NAME

I, **PATCHIGOLLA VISHALI** (Old Name), W/o PATCHIGOLLA KRISHNA KISHORE, R/o 11-45-141, Tavva Vari Street, I Town, Vijayawada -520001, NTR(D), A.P., India have changed my Name to **PACHIGOLLA VISHALI,** Here after my name is known as **PACHIGOLLA VISHALI**

గ్రామ పంచాయతీ కార్యాలయము - కలగర
విస్సన్నపేట మండలం, యన్.టి.ఆర్.జిల్లా

ఆర్.సి.నెం : నిల్/2023 **టెండర్ ప్రకటన** తేది : 10-03-2023

ఎన్.టీ.ఆర్ జిల్లా, విస్సన్నపేట మండలం, కలగర గ్రామ పంచాయతీ నందు **2023-2024** సంవత్సరమునకు అనగా **డి.01-04-2023 నుండి డి.31.03.2024** వరకు కాంట్రాక్టు పద్ధతిపై కాంట్రాక్టు లేబరును, రోజువారి వేతనంపై దిగువ తెలిపిన విధులు నిర్వర్తించుటకు గాను **డి. 18.03.2023 శనివారం మధ్యాహ్నం 3గం॥లకు** పంచాయితీ కార్యదర్శి వారిచే గాని లేక వారి అనుమతి పొందిన వారిచే గాని సీల్డు టెండర్లు స్వీకరించబడును. సదరు టెండర్లు అదేరోజు సాయంత్రం 4గం॥లకు హాజరైన టెండర్లు దారులు సమక్షంలో తెరవబడును. మిగిలిన షరతులు కార్యాలయం పనివేళల యందు అడిగి తెలుసుకోవచ్చును.

వ.నెం	పని వివరము	కావలసిన వ్యక్తుల సంఖ్య	పని కాలము	ధరావత్తు
1.	పారిశుధ్య నిర్వహణ	02	01-04-2023 టు 31-03-2024	1000/-
2.	వీధి లైట్లు నిర్వహణ	01	01-04-2023 టు 31-03-2024	1000/-
3.	మంచినీటి నిర్వహణ	02	01-04-2023 టు 31-03-2024	1000/-

గమనిక :- 1. గతంలో పనిచేసిన వారికి ప్రాధాన్యత ఇవ్వబడును
2. పంచాయితీలో నిధుల నిల్వలను బట్టి చెల్లింపులు జరుపబడును.

శ్రీమతి దేశిరెడ్డిరమ
సర్పంచ్, కలగర గ్రామపంచాయతీ

ఎస్. రామారావు,
పంచాయతీ సెక్రటరీ కలగర గ్రామపంచాయతీ